PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

| బుధవారం WEDNESDAY 10.09.2025 | కరీంనగర్ KARIMNAGAR పేజీలు : 4 pages : 4 సంపుటి :1 ‖ సంచిక :06 ‖ ధర : 4.00 | తదియ | బుధవారం, సూర్యోదయం: 5-45, సూర్యాస్తమయం: 6-44. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం కృష్ణ పక్షం తిథి: తదియ రాత్రి 12-36 వరకు. నక్షత్రం: విశాఖ ఉదయం 9-09 వరకు, తదుపరి అనురాధ, వర్జ్యం: పగలు 1-34 నుంచి పగలు 3-20 వరకు, రాహుకాలం: పగలు 3-25 నుంచి సాయంత్రం 5-02 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-20 నుంచి ఉదయం 9-12 వరకు, పునర్ దుర్ము హూర్తం: రాత్రి 11-05 నుంచి రాత్రి 11-50 వరకు. అమృతకాలం: రాత్రి 12-14 నుంచి రాత్రి 2-01 వరకు. | CIRCULATED AT: WARANGAL, HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA ADILABAD, NIZAMABAD, RANGAREDDY, MAHABUBNAGAR, MEDAK WWW.MEKARTHI DINAPATRIKA.COM |
|---|---|---|---|---|

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్

**ఇంటర్నెట్ డెస్క్ మేకార్తి దినపత్రిక**

భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సి.పి. రాధాకృష్ణన్ కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందనలు తెలిపారు. 'ప్రజా జీవితంలో మీ దశాబ్దాల గొప్ప అనుభవం దేశ పురోగతికి గణనీయంగా దోహదపడుతుంది. విజయవం తమైన, ప్రభావవం తమైన పదవీకాలం కోసం మీకు నా శుభాకాంక్షలు.'అని భారత రాష్ట్రపతి ఆకాంక్షించారు. భారత నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రాధాకృష్ణన్ జీవితం ఎల్లప్పుడూ ప్రజాసేవకే అంకితమైందని ప్రధాని మోదీ ప్రశంసించారు. అణగారిన వర్గాల సాధికారతకు కృషి చేసిన వ్యక్తి రాధాకృష్ణన్ అని మోదీ అన్నారు. అత్యుత్తమ ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ నిలుస్తారని భావిస్తున్నానని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను రాధాకృష్ణన్ బలోపేతం చేస్తారని ఆశిస్తున్నానని మోదీ చెప్పారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సి.పి. రాధాకృష్ణన్ కి అభినందనలు తెలిపారు. 'సమాజంలో అట్టడుగు స్థాయి నుండి ఎదిగిన నాయకుడిగా మీ వివేకం, పరిపాలన గురించిన లోతైన జ్ఞానం, అణగారిన వర్గాలకు సేవ చేయడంలో సహాయపడతాయని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను. ఎగువ సభ పవిత్రతకు సంరక్షకుడిగా మీ ప్రయాణానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.' అని అమిత్ షా అన్నారు.

ప్రముఖ బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి.. భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సిపి రాధాకృష్ణన్ కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 'మీ జ్ఞానం, దార్శనికత కచ్చితంగా దేశానికి మార్గనిర్దేశం చేస్తుంది' అని సునీల్ శెట్టి అభిలషించారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికైన కొత్త ఉపరాష్ట్రపతి పార్లమెంటరీ సంప్రదాయాల అత్యున్నత నైతికతను నిలబెట్టుకుంటారని, ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు.. గౌరవాన్ని ఇస్తారని, పాలక వర్గ ఒత్తిళ్లకు లొంగరని ఆశిస్తున్నామని ఖర్గే తన సందేశంలో పేర్కొన్నారు



# యూరియా కోసం రైతుల ఆందోళన



**వాంకిడి, సెప్టెంబరు మేకార్తి దినపత్రిక**

: యూరియా పంపిణీలో ప్రాథమిక సహకార సంఘం అధికారులు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని నిరసిస్తూ మంగళవారం పీఏసీఎస్ ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. యూరియా కోసం రోజుల తరబడి పీఏసీఎస్ కార్యాలయాల చట్టూ తిరగాల్సి వస్తుందని రైతులు మండిపడుతున్నారు. మూడు నెలల క్రితం యూరియా కోసం పట్టాదారు పాసుపుస్తకాల జిరాక్స్ పత్రాలు ఇస్తే ఇప్పటి వరకు అందించలేదని రైతులు వాపోతున్నారు. ముందు ఇచ్చిన పత్రాలను పక్కన పెట్టి కొత్తవారికి యూరియా ఇస్తున్నారని చెబుతున్నారు. రోజుల తరబడి యూరియా కోసం కార్యాలయం చుట్టు తిరుగుతూ ఉండాలా అంటు వాగ్వా దానికి దిగారు. సీరియల్ ప్రకారం యూరియా అందించాలని రైతులు డిమాండ్ చేశా రు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. లోడ్ ఎరువులు రావడంతో ఎకరానికి ఒక బస్తా చొప్పున అందచేసినట్లు చెబుతున్నారు.

కాగజ్‌నగర్ : యూరియా సరఫరా చేయాలని మంగళవారం కాగజ్‌నగర్ వ్యవసాయా మార్కెట్ కార్యాలయ సమీపంలోని రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు పలువురు మాట్లాడుతూ తమకు కూపన్లు ఇచ్చి ఇంత వరకు యూరియా సరఫరా చేయడం లేదన్నారు. అధికారులు యూరియాను త్వరలోనే అందరికి అందజేస్తామని పేర్కొనటంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

దహెగాం: ఎరువుల కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. యూరియా కోసం గత 20 రోజులుగా యూరియా వచ్చిన విషయాన్ని తెలుసుకొని మంగళవారం రైతులు దహెగాం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్దకు చేరుకొని క్యూలో చెప్పులు పెట్టారు. ఒక్క రైతుకు 2 నానో, 2 యూరియా బస్తాలు పంపిణీ చేసినట్లు పీఏసీఎస్ సీఈవో బక్కయ్య, తెలిపారు. రైతులకు 444 యూరియా బస్తాలు 444 నానో స్ప్రే బాటిళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది నారాయణ, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

రోజుల తరబడి ఎదురుచూపులు..

కోరెంగ పర్వత్‌రావు, రైతు యూరియా కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. జూలైలో పట్టాదారులు పుస్తకం జిరాక్స్ ధ్రువపత్రాలు పీఏసీఎస్ కార్యాలయంలో అందించాను. రెండు నెలల నుంచి యూరియ కోసం కార్యాలయం చట్టు తిరుగున్నా నా పత్రాలు తీయలేదు. కార్యాలయం సిబ్బంది ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పాను. సార్ నాకు యూరియా ఇవ్వాలని అడిగాను. నువ్వు యూరియా తీసుకుపోయావు నీకు రాదు అంటు నాకు పత్రాలు తిరిగి ఇచ్చేశారు. రెండు నెలల నుంచి యూరియ కోసం తిరిగినా ఫలితం లేకుండా పోయింది. నా పత్రాలపై వెరొకరికి యూరియా ఇచ్చారు. ఉన్నతాధికారులు సందించి యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలి.

# బాలాపూర్ గణేషుడికి రికార్డు స్థాయి హుండీ ఆదాయం



**మేకార్తి దినపత్రిక**

రెండు తెలుగు రాష్ట్రాల్లో వినాయక చవితి ఉత్సవాల సందడి అంగరంగ వైభవంగా ముగిసింది. తొమ్మిది రోజుల పాటు గణపయ్యను భక్తిశ్రద్ధలతో పూజించి ఘనంగా నిమజ్జన మహోత్సవాలు నిర్వహించారు. ఎప్పట్లాగే ఈసారీ హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ బడా గణేశుడితోపాటు బాలాపూర్ గణేష్ ఉత్సవాలు కూడా భక్తులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇక,ఈ సంవత్సరం బాలాపూర్ వినాయకుడి లడ్డూ..వేలంపాటలో రికార్డు ధర కొల్లగొట్టింది. అంతేకాదు బాలాపూర్ గణనాథుని హుండీ ఆదాయమూ భారీగా పెరగడం విశేషం.

వినాయక చవితి అంటేనే తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఒక్కరికీ ఖైరతాబాద్ బడా గణేష్, బాలాపూర్ లడ్డూ వేలం పాట కచ్చితంగా గుర్తుకువస్తాయి. భక్తుల అంచనాలకు తగినట్లే ప్రతి ఏడూ సరికొత్త శోభలతో అంగరంగ వైభవంగా వినాయక నవరాత్రులు జరుగుతాయి. ఈసారి బాలాపూర్ లడ్డూ వేలం పాటకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 38 మంది వేలంలో పాల్గొన్నారు. వేలం పాట ప్రారంభ ధర రూ.1,116గా ఉండగా చివరికి రూ.35 లక్షల వద్ద ముగిసింది. ఈసారి లడ్డూని కర్మాన్ ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ దక్కించుకున్నారు. గతేడాది కంటే బాలాపూర్ లడ్డూ దాదాపు రూ.5 లక్షలు అధికంగా పలకడం గమనార్హం. ఇక లడ్డూ వేలం పాట ముగిసిన అనంతరం దశరథ్ గౌడ్ బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీకి తన వేలంపాట డబ్బును అందజేశారు.

ఇదే సమయంలో బాలాపూర్ గణపయ్యకు కానుకల రూపంలో హుండీ ద్వారా వచ్చిన ఆదాయం కూడా మునుపటితో పోలిస్తే విపరీతంగా పెరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ కళ్లెం నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఈ సంవత్సరం బాలాపూర్ గణేశుడి హుండీకి మొత్తం రూ.23,13,760 ఆదాయం వచ్చింది. గతేడాది ఈ మొత్తం రూ.18 లక్షలుగా ఉండగా.. ఈసారి దాదాపు రూ.5 లక్షలు పెరిగింది. భక్తులు హుండీలో భారీగా విరాళాలు సమర్పించడంతో ఉత్సవ కమిటీ సంతోషం వ్యక్తం చేస్తోంది. ఈ ఆదాయం గణేష్ సేవల కోసమే వినియోగిస్తామని వారు తెలిపారు.

# ఫార్ములా ఈ- కారు రేస్ కేసులో మరో సంచలనం



**హైదరాబాద్, సెప్టెంబర్ : మేకార్తి దినపత్రిక**

ఫార్ములా ఈ- కారు రేస్ కేసులో ( మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఫార్ములా ఈ- కారు రేస్ కేసులో మాజీమంత్రి కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఇతర అధికారులు బీఎల్ఎన్ రెడ్డి, కిషన్‌రావు, ఎఫ్ఈవోలను ప్రాసిక్యూట్ చేసేందుకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే, గవర్నర్ అనుమతి అనంతరం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ కొనసాగుతోంది.కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కూడా అనుమతి రాగానే వారిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారు ఏసీబీ అధికారులు. కాగా, ఇప్పటికే కేటీఆర్‌ను నాలుగు సార్లు అరవింద్ కుమార్‌ను ఐదుసార్లు విచారించారు ఏసీబీ అధికారులు. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో భారీగా అవినీతి జరిగినట్లు తేల్చారు. ఈ కేసులో క్విడ్‌ప్రోకో జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు.

తొమ్మిది నెలల పాటు పకడ్బందీగా ఏసీబీ అధికారులు విచారణ జరిపారు. కేబినెట్ అనుమతి లేకుండానే ఎఫ్ఈవో కంపెనీకి నిధులు మళ్లించినట్లు ఆరోపణలు రావడంతో 19 డిసెంబర్ 2024న ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రూ.54.88 కోట్లకుపైగా నిధులు దారి మళ్లించారని ఆరోపణలు వచ్చాయి. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో క్విడ్‌ప్రోకో జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు ఏసీబీ అధికారులు.

# రేవంత్ మాటలు వింటే

## అబద్ధాలు సైతం ఆత్మహత్య చేసుకొంటాయి



**హైదరాబాద్, సెప్టెంబర్ మేకార్తి దినపత్రిక :**

తెలంగాణ ముఖ్యమంత్రి, గుంపు మేస్త్రి రేవంత్ రెడ్డి.. గోబెల్స్‌కు తాతగా మారిపోయారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు వ్యంగ్యంగా అన్నారు. రేవంత్ రెడ్డి మాటలు వింటే అబద్ధాలు సైతం ఆత్మహత్య చేసుకుంటాయన్నారు. మంగళవారం నాడు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం నీళ్లతోనే సీఎం రేవంత్ రెడ్డి.. మూసీ ప్రాజెక్టును చేపట్టారని ఎద్దేవా చేశారు. మూసీకి ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ నీళ్లు వస్తున్నాయని రేవంత్ పచ్చి అబద్ధాలు చెప్పారంటూ మండిపడ్డారు.

కాళేశ్వరం ప్రాజక్టులో భాగంగానే మల్లన్నసాగర్‌కు నీళ్లు వస్తున్నాయన్నారు హరీష్ రావు. కేసీఆర్ నిర్మించిన మల్లన్నసాగర్ హైదరాబాద్‌కు వరంగా మారిందని స్పష్టం చేశారు. నిజాలు ఒప్పుకుని.. ప్రజలకు క్షమాపణలు చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు. అన్నీ వదిలేసి.. నడి బజారులో నిలబడినట్లుగా ముఖ్యమంత్రి తీరు ఉందంటూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజక్టులకు రిబ్బన్లు కట్ చేయటానికి.. జేబులో కత్తెర పెట్టుకుని రేవంత్ రెడ్డి తిరుగుతున్నారంటూ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కుర్చీకి ఉన్న గౌరవాన్ని రేవంత్ రెడ్డి తగ్గిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు

# ప్రసాదంలో బూజు ప్రత్యక్షం

**మేకార్తి దినపత్రిక,హైదరాబాద్:** చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో భక్తులకు అందించే ప్రసాదంలో బూజు ప్రత్యక్షం కావడం కలకలం సృష్టించింది. హస్తినాపురం డివిజన్‌కు చెందిన ఓ భక్తుడు మంగళవారం స్వామి వారిని దర్శించుకున్నాడు. అనంతరం స్వామి వారి పులిహోర ప్రసాదాన్ని కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి ప్రసాదం తినడానికి విప్ప చూడగా పులిహోర బూజు పట్టి ఉంది. దీంతో ఖంగుతిన్న ఆయన బూజు పట్టిన పులిహోరను ఫొటో తీసి ఆలయ ధర్మకర్తలకు పంపించారు. అనంతరం వారిని భక్తుడు ప్రశ్నించగా ఆలయ సిబ్బంది పొంతనలేని సమాధానాలు చెప్పారు. భక్తులకు నాణ్యమైన ప్రసాదం అందించాల్సిన బాధ్యత ఆలయ ఈఓ, సిబ్బందిపై ఉందని ధర్మకర్తలు పేర్కొన్నారు.



# తెలంగాణకు రూ.8000 కోట్ల లాభం

**మేకార్తి దినపత్రిక,హైదరాబాద్:**

వస్తు సేవల పన్ను(జీఎస్టీ) సవరణతో రాష్ట్రాలకు నికరంగా ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన 'ఎకోరాప్' నివేదిక చెబుతోంది. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో లాభమా?, నష్టమా? అనే విషయంపై అన్ని రాష్ట్రాలు ఆందోళన చెందుతున్న వేళ.. ఎస్‌బీఐ కీలక విషయాలు వెల్లడించింది. మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో.. ప్రస్తుతం అమలులో ఉన్న నాలుగు శ్లాబుల స్థానంలో, 12, 28శాతం విభాగాలు తొలగించి, 5,18 శ్లాబులను మాత్రమే ఉంచుతూ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే, జీఎస్టీ రేట్ల సవరణ ద్వారా తెలంగాణకు రూ.7 వేల కోట్ల మేర నష్టం వాటిల్లనుందని రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.కానీ.. ఈ నష్టం రూ.10వేల కోట్ల వరకు ఉండొచ్చని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అంచనా వేస్తోంది. ఎస్‌బీఐ మాత్రం రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని, పైగా...నగదు రూపంలో మరింత ప్రయోజనం పొందుతాయని విశ్లేషిస్తోంది. సాధారణంగా మొత్తం జీఎస్టీ వసూళ్లలో కేంద్రానికి 50 శాతం, రాష్ట్రాలకు 50 శాతం నిధులు సమకూరుతాయి.ఇలా రాష్ట్రాలకు




సమకూరే 50 శాతం జీఎస్టీలో రాష్ట్రాల నిధులు గతంలో కంటే పెరుగుతాయని ఎస్‌బీఐ అంచనా వేసింది. జీఎస్టీ హేతుబద్ధీకరణతో ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు రూ 14.10లక్షల కోట్లు అందనున్నాయని తెలిపింది. ఇందులో తెలంగాణకు రూ.8 వేల కోట్ల ప్రయోజనం నివేదిక పేర్కొంది.

# జాతీయం

## మోదీతో మాట్లాడతా




భారత ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవలి కాలంలో సుంకాల పేరుతో భారత్‌పై తన ఆగ్రహాన్ని వెల్లిబుచ్చిన ట్రంప్ ధోరణిలో క్రమంగా మార్పు వస్తోంది. చైనా, రష్యాలతో భారత్ స్నేహం ట్రంప్‌ను, అమెరికా యంత్రాంగాన్ని ఆత్మరక్షణలో పడేసింది. దీంతో ట్రంప్ మాటల్లో మార్పు వస్తోంది. దీంతో ట్రంప్ తాజాగా తన సోషల్ మీడియా 'ట్రూత్' ద్వారా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

అమెరికా, భారత్ మధ్య వాణిజ్య అడ్డంకులను పరిష్కరించడానికి నా పరిపాలనా విభాగం చర్చలు జరుపుతోంది. ఈ అంశంపై నా మిత్రుడైన భారత ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. త్వరలోనే నా మిత్రుడు మోదీకి ఫోన్ చేస్తా. ఇండియాతో ట్రేడ్ డీల్ గురించి మాట్లాడతా. ట్రేడ్ డీల్ విజయవంతమవుతుందని ఆశిస్తున్నా' అంటూ ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో భారత్ గురించి ట్రంప్ ఇంత సానుకూలంగా మాట్లాడడం ఇదే ప్రథమం. కొన్ని రోజులుగా ట్రంప్, అతడి కార్యవర్గం భారత్‌ను హెచ్చరించేందుకు ప్రయత్నించారు.

రష్యా నుంచి అధికంగా చమురు కొంటోందనే సాకు చూపి భారత్‌పై ట్రంప్ అక్కసు వెళ్లగక్కారు. భారత దిగుమతులుపై ఏకంగా 50 శాతం పన్నులు విధించారు. దీంతో భారత ప్రధాని మోదీ షాంఘై సహకార సదస్సుకు హాజరై చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లతో ద్వైపాక్షిక భేటీలు నిర్వహించారు. ఈ భేటీలపై ట్రంప్ స్పందిస్తూ.. చైనా చీకటి వలయంలోకి భారత్ వెళ్లిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కొన్ని గంటల్లోనే మాట మార్చారు. ప్రధాని మోదీని ప్రశంసలతో ముంచెత్తారు.

## కేరళ కోర్టు సంచలన తీర్పు




త్రివేంద్రం: వ్యభిచార గృహంలో సెక్స్‌వర్కర్ నుంచి సేవ పొందుతున్న విటుడిపై అనైతిక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద కేసు నమోదు చేయవచ్చునని కేరళ హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. ఎందుకంటే అలాంటి సేవలకు చెల్లింపులు వ్యభిచారాన్ని ప్రేరేపించడమే అవుతుందని పేర్కొంది. సెక్స్ వర్కర్లను వాణిజ్య లావాదేవీలలో వస్తువుగా పరిగణించ రాదని జస్టిస్ వీజీ అరుణ్ కీలక తీర్పు చెప్పారు.

వ్యభిచార గృహాలలో సేవలు కోరుతున్న విటులు సెక్స్ వర్కర్ల దోపిడీలో చురుకైన భాగస్వాములు కాబట్టి, వారిని కేవలం కస్టమర్లుగా పరిగణించలేమని తెలిపారు. ఒక వ్యక్తిని వినియోగదారుడిగా పరిగణించాలంటే అతను ఏదైనా వస్తువు లేదా సేవలను కొనుగోలు చేయాలని, అయితే సెక్స్ వర్కర్‌ను ఒక వస్తువుగా, ఆమె అందించే లైంగిక సుఖం ఒక సేవగా పరిగణించలేమని తెలిపింది.

అలాంటి వృత్తిలో ఉన్న వారిని మానవ అక్రమ రవాణా ద్వారా తీసుకువచ్చి బలవంతంగా ఆ వృత్తిని చేయిస్తుంటారని, వారు ఒక విధంగా బాధితులేనని ఆయన తీర్పులో పేర్కొన్నారు. విటుడు తాను పొందే సేవలకు సొమ్ము చెల్లించినప్పటికీ అది ఎక్కువ భాగం వ్యభిచార గృహ నిర్వాహకులకే చేరుతుందన్నారు. కేసు వివరాల్లోకి వెళితే.. ఒక వ్యభిచార గృహంలో సెక్స్‌వర్కర్ నుంచి సేవలు పొందుతున్న తనపై కేసు పెట్టారని ఒక వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. తాను కస్టమర్‌గా వారి వద్దకు వెళ్లి సేవలు పొందానని వాదించాడు.

## జాతీయ సగటు కంటే రాష్ట్రానిదే అధికం



అమరావతి: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాభివృద్ధి గాడిన పడుతోంది. చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వృద్ధి రేటు ఊపందుకుంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 మొదటి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.5 శాతం వృద్ధిరేటు సాధించిందని, ఇది జాతీయ సగటు వృద్ధిరేటు 8.8 శాతం కంటే ఎక్కువని ప్రణాళిక శాఖ అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. గత ఏడాది ఇదే సమయంలో రాష్ట్రంలో 9.58 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. వృద్ధిరేటు గణాంకాలు, ఆర్థిక సంవత్సరం మొత్తం వృద్ధిరేటు అంచనాలపై సీఎం మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక మార్గనిర్దేశం చేశారు. సుస్థిర ఆర్థిక వ్యవస్థను సాధించేందుకు వృద్ధి లక్ష్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలని, త్రైమాసిక ఫలితాలకు తగ్గట్టుగా తదుపరి కార్యాచరణ ఉండాలని అన్నారు. రెండంకెల వృద్ధి రేటుపై సంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి.. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్న 17.1 శాతం వృద్ధి సాధనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. కొన్ని రంగాలు ఎందుకు పురోగతి సాధించడం లేదనే దానిపై కారణాలు తెలుసుకునేందుకు నిపుణులతో ప్రత్యేకంగా అధ్యయనం జరపాలని సూచించారు. పర్యాటకంలో ప్రస్తుతం సాధించిన 17.08 శాతం పురోగతి సరిపోదని.. ఈ రంగంలో 25 శాతం వృద్ధికి అవకాశం ఉందని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వృద్ధిలోనూ అంతర్జాతీయ లక్ష్యాలను అందుకోవాలన్నారు. రైల్వేలు, రవాణా, హోటళ్లు, కమ్యూనికేషన్స్, బ్యాంకింగ్, బీమా, రియల్ ఎస్టేట్ వంటి రంగాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. శాఖలు, రంగాలు, నియోజకవర్గాల వారీగా జీఎస్‌డీపీ వివరాలను లోతుగా నమోదు చేయాలని సూచించారు.

పరిశ్రమల రంగంలో అత్యధిక వృద్ధి

2025-26 తొలి త్రైమాసికంలో రాష్ట్ర జీఎస్‌డీపీలో వృద్ధి జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని ప్రణాళికా విభాగం అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జీవీఏ రూ.3,57,894 కోట్లుగా వెల్లడించారు. గత ఏడాది ఇదే సమయంలో రాష్ట్రంలో 9.58 శాతం వృద్ధి నమోదు కాగా, ఈ ఏడాది 10.5 శాతం సాధ్యమైందని పేర్కొన్నారు. ఏపీ జీఎస్‌డీపీ వృద్ధిని రంగాలవారీగా పరిశీలిస్తే పరిశ్రమల శాఖలో 11.91 శాతం, వ్యవసాయ రంగంలో 9.60 శాతం, సేవల రంగంలో 10.76 శాతం వృద్ధి కనిపిస్తోందని తెలిపారు.

# ఖర్చులు భరించలేం



### నిత్యావసరాలూ కొనలేకున్నాం దేశంలో 58 శాతం మంది ప్రజల అభిప్రాయమిదే మూడేండ్లలో ఏకంగా 33 శాతం పెరిగిన కుటుంబాల ఖర్చులు ధరాఘాతంతో చితికిపోయామని చెప్పిన 59 శాతం మంది అత్యవసరమైన వస్తువులనే కొంటున్నామన్న 80% మంది 'వరల్డ్ ప్యానెల్ బై న్యూమరేటర్' తాజా సర్వేలో వెల్లడి

హైదరాబాద్ : కేంద్రంలోని ఎన్డీయే పాలనలో ధరాఘాతంతో పేద, మధ్యతరగతి ప్రజల జీవనం అస్తవ్యస్థమైంది. ద్రవ్యోల్బణం నియంత్రణలో మోదీ సర్కారు వైఫల్యం.. సామాన్యుడి బతుకు చిత్రాన్ని ఛిద్రం చేస్తున్నది. గడిచిన మూడేండ్లలో ఇంటి ఖర్చులు భారీగా పెరిగిపోయాయని, నిత్యావసరాలను కూడా కొనలేకపోతున్నామని దేశంలోని 58 శాతం మంది ప్రజలు లబోదిబోమంటున్నారు. పొదుపు మాట అటుంచితే, పిల్లల స్కూల్ ఫీజుల కోసం కొత్తగా అప్పులు చేయాల్సిన దుస్థితి వాటిల్లిందని మెజార్టీ ప్రజలు వాపోతున్నారు. ఈ మేరకు మార్కెట్ రిసెర్చ్ సంస్థ 'వరల్డ్ ప్యానెల్ బై న్యూమరేటర్' తాజా సర్వేలో వెల్లడించింది.

మూడేండ్లలోనే పైపైకి

ద్రవ్యోల్బణం కట్టలు తెంచుకోవడంతో నిత్యావసరాల కోసం చేసే ఖర్చులు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఒక్కో ఇంటిలో సగటున చేసే త్రైమాసిక ఖర్చు మూడేండ్లలోనే 33 శాతం కంటే ఎక్కువగా పెరిగినట్టు 'వరల్డ్ ప్యానెల్ బై న్యూమరేటర్' సర్వేలో తేలింది. 2022లో త్రైమాసిక గృహ వ్యయం రూ. 42 వేలుగా ఉంటే, 2025నాటికి రూ. 56 వేలకు చేరుకొన్నట్టు సర్వే తెలిపింది. నిత్యావసరాల ఖర్చు పెరిగిపోతుండటంతో తక్కువ ఆదాయం కలిగిన పేద, దిగువ మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు సర్వే అభిప్రాయపడింది. పాలు, పండ్లు, నూనె, బియ్యం, పప్పులు, సబ్బు వంటి నిత్యావసరాల ధరలు మండిపోతుండటంతో సామాన్యుల బడ్జెట్ గతి తప్పినట్టు సర్వేలో పాల్గొన్న మెజార్టీ ప్రజలు వాపోయారు. స్కూల్ ఫీజులు కూడా భారీగా పెరిగిపోవడంతో కొత్తగా అప్పులు చేయాల్సిన దుస్థితి వాటిల్లుతున్నట్టు పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

నిరాశలోనే..

ధరల కట్టడిలో కేంద్రం తీసుకొంటున్న చర్యలు సానుకూల ఫలితాలను ఇస్తాయని వినియోగదారులు విశ్వసించడంలేదు. ఆర్బీఐ మేలో విడుదల చేసిన కన్జ్యూమర్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్‌లో సూచీ విలువ 95.4కు పరిమితమవ్వడమే దీనికి రుజువు. దీన్ని ధ్రువపరుస్తూ.. ధరాఘాతం ఇలాగే కొనసాగితే, రానున్న మూడు నెలల్లో తమ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారవచ్చని సర్వేలో పాల్గొన్న 59 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు. దివాలానే తమకు శరణ్యమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తీసుకొనే చర్యలతో తమ ఆర్థిక భారం తగ్గొచ్చని 11 శాతం మంది ఆశాభావం వ్యక్తం చేశారు.

చవకైన వాటి కోసం..

పెరుగుతున్న ఖర్చులను నియంత్రించుకోవడానికి మార్కెట్‌లో చవగ్గా దొరికే వస్తువులను ఎంచుకొంటున్నట్టు, అత్యవసరమైతేనే ఆ వస్తువులను ఖరీదు చేస్తున్నట్టు ఏకంగా 80 శాతం మంది తెలిపారు. అదనపు ఆదాయం వస్తే, భవిష్యత్తు అవసరాల కోసం దాన్ని పొదుపు చేస్తామని 54 శాతం మంది పేర్కొన్నారు. సర్వేలో మొత్తంగా 6 వేల మంది పాల్గొంటే, ప్రతీ ఏటా 14 శాతం మేర ధరలు పెరుగుతున్నాయని మెజార్టీ ప్రజలు అభిప్రాయపడ్డారు. ధరాఘాతాన్ని తగ్గించడానికి కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అవసరమైతేనే కొంటున్నారు

పెరిగిన ధరలతో తమకు ఏవైతే అవసరమో వాటినే ప్రజలు కొంటున్నారు. వృథా ఖర్చులు తగ్గాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇది స్పష్టంగా కనిపిస్తున్నది. భవిష్యత్తు దృష్ట్యా పొదుపు చేయడం, అప్పులను తీర్చడంపై ప్రజలు దృష్టిసారిస్తున్నారు.

## నిర్ణీత గడువు తప్పనిసరి

### గవర్నర్లు బిల్లులకు ఆమోదం తెలపడంపై సుప్రీంకోర్టు



గమనం,న్యూఢిల్లీ: రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలిపే అధికారాలను నియంత్రించే ఆర్టికల్ 200లో 'సాధ్యమైనంత త్వరగా' అనే పదం లేకపోయినా గవర్నర్లు నిర్ణీత సమయంలో నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు మంగళవారం పేర్కొంది. అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లులకు గవర్నర్ సమ్మతించడానికి, రాష్ట్రపతికి నివేదించడానికి కోర్టు నిర్దేశిత కాలపరిమితి విధించవచ్చా? అన్న అంశంపై ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందు 8వ రోజు విచారణ కొనసాగింది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు సంబంధించి గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 200 వివరించిందని, దాని ప్రకారం గవర్నర్లు బిల్లుకు ఆమోదం తెలపాలి, లేదా ఆమోదాన్ని నిలువరించాలి, పునః పరిశీలన కోసం, లేదా నిలిపివేత కోసం రాష్ట్రపతికి పంపాలని కోర్టు తెలిపింది. గవర్నర్ నిర్ణీత సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని కోర్టు అభిప్రాయపడింది. ఈ కేసుకు సంబంధించిన వాదనలను సెప్టెంబర్ 10న ముగించాలని ధర్మాసనం నిర్ణయించింది.

## కొండచరియలు విరిగి..ముగ్గురు సైనికులు మృతి



లడక్ సియాచిన్ గ్లేసియర్‌లోని బేస్ క్యాంప్ వద్ద మంగళవారం మంచు చరియలు విరిగిపడ్డాయి. దాంతో ముగ్గురు సైనికులు వీరమరణం పొందారు. రక్షణవర్గాల సమాచారం మేరకు.. ఈ ఘటన అకస్మాత్తుగా జరిగిందని.. రెస్క్యూ టీం వెంటనే సహాయక చర్యలు చేపట్టాయి. సైన్యం ఇతర సైనికులను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. సైనికుల మృతదేహాల కోసం అన్వేషణ కొనసాగుతోందని ఓ అధికారి తెలిపారు. పెద్ద ఎత్తున హిమపాతం పెరిగింది.

సియాచిన్ గ్లేసియర్ ప్రపంచంలోనే ఎత్తయిన వార్ జోన్. ఇక్కడ ఉష్ణోగ్రతలు సున్నా నుంచి మైనస్ 60 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతాయి. దాంతో ఇక్కడ సైనికులు మంచు తుఫానుతో ఇబ్బందులుపడుతుంటారు. తీవ్రమైన చలి కారణంగా పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో పాటు పలు సమస్యలు ఉంటాయి. సియాచిన్ గ్లేసియర్ ఇండో-పాక్ నియంత్రణ రేఖకు సమీపంలో 78 కిలోమీటర్ల విస్తరించి ఉంటుంది. ఒక వైపు పాకిస్తాన్, మరొక వైపు చైనా సరిహద్దు అక్సాయ్ చిన్ ఉంటుంది. వ్యూహాత్మకంగా సియాచిన్ గ్లేసియర్ భారత్‌కు కీలకం. 1984కి ముందు.. ఇక్కడ భారత సైన్యం ఉండేది కాదు. 1972 సిమ్లా ఒప్పందంలో సియాచిన్ ప్రాంతాన్ని బంజరు భూమిగా ప్రకటించారు.

కానీ, ఒప్పందంలో రెండుదేశాల మధ్య సరిహద్దులను నిర్ణయించలేదు. 1984 సంవత్సరంలో పాకిస్తాన్ సియాచిన్‌ను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా భారత్‌కు నిఘా సమాచారం అందింది. ఆ తర్వాత 1984 ఏప్రిల్ 13న భారత్ తన సైన్యాన్ని మోహరించింది. ఈ ప్రదేశాన్ని స్వాధీనం చేసుకోవడానికి సైన్యం ఆపరేషన్ మేఘదూత్‌ను ప్రారంభించింది.

సియాచిన్ గ్లేసియర్ ప్రాంతం పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్, అక్సాయ్ చిన్ షాక్స్‌గామ్ లోయలకు ఆనుకొని ఉంటుంది. వీటిని పాకిస్తాన్ 1963లో చైనాకు అప్పగించింది. ఇది భారతదేశానికి వ్యూహాత్మకంగా ఎంతో ముఖ్యమైంది. శత్రువుల కార్యకలాపాలపై నిఘా వేసి ఉండవచ్చు. ఈ ప్రదేశం లేహ్ నుంచి గిల్గిట్ వరకు ఉన్న మార్గాలను సైతం నియంత్రిస్తుంది. సైన్యంపరంగా, వ్యూహాత్మకంగా ఈ గ్లేసియర్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

# అంతర్జాతీయం

## నేపాల్ ప్రధాని అధ్యక్షుల ఇళ్లపై దాడులు

### పార్లమెంట్ భవనం దహనం





**కఠ్మాండు(నేపాల్), సెప్టెంబర్ మేకార్తి దినపత్రిక :** నేపాల్‌లో జెన్ జెడ్ యువత ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలు ఆ దేశ ప్రభుత్వాన్నే కూల్చేశాయి. సోషల్ మీడియా ఆంక్షలు, అవినీతి, బంధువుల ప్రాధాన్యతలపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ప్రధాని కె.పి.శర్మ ఓలి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించాయి. ప్రభుత్వ వ్యతిరేకంగా ప్రదర్శనలు హింసాత్మకంగా మారి దేశంలో భయోత్పాతాన్ని సృష్టించాయి.

ప్రధాని ఓలి అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ ఇళ్లను ఆందోళనకారులు ధ్వంసం చేశారంటే నేపాల్‌లో పరిస్థితి అర్థం అవుతుంది. నిరసనకారులు మాజీ ప్రధాని పుష్పకమల్ దహల్ ఇంటిని కూడా ధ్వంసం చేశారు. ఈ ఘటనలు దేశవ్యాప్తం గా కర్ఫ్యూ విధించడానికి దారితీసాయి. గత వారం నుంచి నేపాల్ ప్రభుత్వం ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విటర్), యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై ఆంక్షలు విధించడంతో యువతలో కోపం రగిలింది.

అయితే, ఈ ఆంక్షలు ఎత్తివేసినా ప్రదర్శనలు మాత్రం ఆగలేదు. అవినీతి, బంధుప్రీతి రాజకీయాలు(నెపో కిడ్స్, నెపో బేబీస్)కు ప్రాధాన్యత అంటూ జనం గళమెత్తారు. 'అవినీతిని ఆపండి.. సోషల్ మీడియాను కాదు' అనే నినాదాలతో లక్షలాది మంది నిరసనకారులు కాఠ్మాండూ రోడ్లెక్కారు. నిరసనకారులు పార్లమెంట్ భవనంపై దాడి చేసి భవనాన్ని దహనం చేశారు. మాజీ ప్రధాని షేర్ బహాదూర్ దేవుబా, ఎనర్జీ మంత్రి దీపక్ ఖడ్కా ఇళ్లనూ నిరసనకారులు లక్ష్యంగా చేసుకున్నారు.

పచండ ఇంటిపై రాళ్ల దాడి, ధ్వంసం చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసులతో జరిగిన ఘర్షణల్లో కనీసం 19 మంది నిరసనకారులు మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. పోలీసులు నిరసనకారులపై కాల్పులు జరిపారని ఆరోపణలు వచ్చాయి. ప్రదర్శకుల్లో ఒకరైన నారాయణ్ అచార్య మాటల్లో.. 'మా యువత, స్నేహితులు చంపబడుతున్నారు. న్యాయం కావాలి, ఈ ప్రస్తుత పాలితవర్గం తొలగాలి కెపిఓలిని తరిమిఎయాలి' అంటూ నినదించారు.

దుర్గనహ్ దహల్ అనే మరో నిరసనకారుడి మాటల్లో.. 'ఈ హిట్లర్‌లా ఉన్న కె.పి.ఓలి ప్రభుత్వం చేత యువత, విద్యార్థులు చంపబడుతున్నారు. ఈ ప్రభుత్వం ఉన్నంత కాలం మేం బాధపడతూనే ఉంటాం' అంటూ ధ్వజమెత్తారు. కాగా, వంటి హ్యాష్‌ట్యాగ్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రభుత్వం సోషల్ మీడియా ఆంక్షలు ఎత్తివేసినప్పటికీ, కర్ఫ్యూ విధించి పరిస్థితిని నియంత్రించడానికి ప్రయత్నించింది. మంత్రులు రాజీనామాలు చేస్తూ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తుండటంతో చివరికి ప్రధాని ఓలి సైన్యం సూచన మేరకు రాజీనామా సమర్పించారు. దుబాయ్ పారిపోవాలని ఓలి ప్లాన్ చేసుకున్నప్పటికీ ముందు రాజీనామా చేయండంటూ సైన్యం వారించడంతో చివరికి ఓలి దిగిరాక తప్పలేదు.

## రోడ్డుపై ఆర్థిక మంత్రిని చితకబాదిన యువకులు





**కఠ్మాండూ, సెప్టెంబర్ మేకార్తి దినపత్రిక :** ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం ప్రకటించినా. ఆ దేశ యువకుల్లో ఆగ్రహం మాత్రం చల్లారలేదు. మంగళవారం నాడు మాజీ ప్రధాని జలనాథ్ ఖనాల్ నివాసాన్ని వారంతా చుట్టుముట్టి తగలబెట్టారు. ఈ ఘటనలో ఆయన భార్య సైతం అగ్నికి ఆహుతి అయ్యారు. ఇక ఆర్థిక మంత్రి భాను ప్రసాద్ పాడేల్‌ను కాఠ్మాండూ నగర వీధుల్లో పరిగెత్తించి పరిగెత్తించి మరీ ఆయనపై దాడి చేశారు. అందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దేశంలో సోషల్ మీడియా సేవలను నిలిపివేయడం, ప్రభుత్వంలో అవినీతి పెచ్చురిల్లడం, బంధు ప్రీతి అంతకం తకు పెరిగిపోవడం నేపాల్ యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ క్రమంలో సోషల్ మీడియాపై నిషేధాన్ని ఎత్తివేయాలని, అవినీతిని అరికట్టాలంటూ నేపాల్ దేశవ్యాప్తం గా యువకులు నిరసనలు చేపట్టారు. ఈ నిరసనలు అరికట్టేందుకు ఆర్మీని ప్రభుత్వం రంగంలోకి దింపింది. ఈ సందర్భంగా యువకుల నిరసనలు అరికట్టే క్రమంలో ఆర్మీ భాష్ప వాయుు గోళాలను ప్రయోగించింది. అలాగే ఆందోళనకారులపై రబ్బరు బుల్లెట్లను వినియోగించింది. దీంతో బాలుడితో సహా 22 మంది మరణించారు.

ఈ నేపథ్యంలో సోమవారం నేపాల్ హోంమంత్రి తన పదవికి రాజీనామా చేశారు. అలాగే సోషల్ మీడియాపై విధించిన ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అయినా.. యువకుల్లో ఆగ్రహం మాత్రం చల్లార లేదు. దీంతో మంగళవారం ఉదయం ప్రధాని కేపీ శర్మ ఓలీ తన పదవికి రాజీనామా చేశారు. అయినా వారి కోపం మాత్రం తీరలేదు. ఈ మేరకు ఆర్థికమంత్రిని నడిరోడ్డుపై దారుణంగా కొట్టారు. పరిగెడుతున్నా వదిలిపెట్టకుండా వెంటపడి మరీ ఎగిరెగిరి తన్నారు.

## హమాస్ నాయకత్వమే టార్గెట్

**ఇంటర్నెట్ డెస్క్: మేకార్తి దినపత్రిక :** ఖతర్ రాజధాని దోహాలో పలు చోట్ల పేలుళ్ల జరగడం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో హమాస్ సీనియర్ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ కచ్చితత్వంతో దాడులు చేశామని ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించడం సంచలనానికి దారి తీసింది తాము టార్గెట్ చేసిన హమాస్ నాయకత్వం అక్టోబర్ 7 నాటి మారణహోమానికి ప్రత్యక్షంగా కారణమని ఇజ్రాయెల్ మిలిటరీ తన ప్రకటనలో తెలిపింది. ఇప్పటికీ ఇజ్రాయెల్‌పై వారు దాడులు కొనసాగిస్తున్నారని పేర్కొంది చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. హమాస్ ఉగ్రసంస్థ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ ఈ దాడులు నిర్వహించి నట్టు వెల్లడించారు.



## గ్రామ సమైక్య సంఘం ద్వారా

### రైతులకు యూరియాను అందించండి



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ముస్తాబాద్**

ముస్తాబాద్ మండలంలోని కొన్ని గ్రామాలకు యూరియా మహిళా సమైక్య సంఘాల ద్వారా గ్రామాలలో అందిస్తున్నందున ఆ గ్రామలతో పాటు ముస్తాబాద్ గ్రామానికి కూడా యూరియా అందించాలని, ఈ గ్రామం పెద్దదైనందున రైతుల కొరకు రెండు లారీల యూరియాను తెప్పించి, గ్రామ రైతులకు అందించాలని మండల మహిళా సమైఖ్య అధికారిని (ఏపిఎం) కల్యాణి గారిని కోరిన కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, బిఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు శీలం స్వామి లు మండల వ్యవసాయ అధికారి చెప్తే మేము డీడీలు కట్టి తెప్పిస్తామని సానుకూలంగా మాట్లాడారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి దుర్గరాజు ని కలిసి ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ రైతుల కొరకు రెండు లారీల యూరియాను తెప్పించి రెండు మూడు రోజుల్లో అందించాలని కోరడం జరిగింది. అలాగే యూరియా చల్లే సమయం దాటి దాటిపోతున్నందున పది రోజుల్లోపు సాధ్యమైనంత వరకు యూరియాను తెప్పించి మండల రైతాంగానికి అందించాలని కోరడం జరిగింది. ఆ తర్వాత సప్లై చేసిన రైతుకు ఉపయోగం ఉండదని కోరడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి సానుకూలంగా స్పందిస్తూ మహిళా సమైక్య ఏపీఎం మాట్లాడి త్వరలో వచ్చే యూరియాను ముస్తాబాద్ గ్రామ రైతులకు అందిద్దామని వారు చెప్పడం జరిగింది. అలాగే మండలానికి అవసరమున్నంతవరకు యూరియాను అందించే విధంగానే జిల్లా అధికారులతో మాట్లాడుతున్నామని వ్యవసాయ అధికారి చెప్పడం జరిగింది.

## పేద విద్యార్థిని చదువుకు

### ప్రభుత్వం ఆర్థిక భరోసా



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

పేద విద్యార్థిని చదువుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది, చదువు మధ్యలో ఆగిపోకుండా కళాశాలలో చెల్లించాల్సిన ఫీజు కోసం ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

తంగళ్ళపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన ఇమ్మడోజు ఆశ్రిత హైదరాబాద్ లోని ఒక ప్రైవేటు కళాశాలలో బీటెక్ మూడవ తరగతి చదువుతుంది. కళాశాలలో ఫీజు చెల్లించేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేదని, ఆర్థిక సహాయం చేయాలని హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు సమర్పించింది. స్పందించిన ప్రభుత్వం తగిన సహాయం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కు సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆశ్రిత తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఉన్నత విద్య అభ్యసించి, లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ కూతురు చదువుకు ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం, సహకరించిన జిల్లా కలెక్టర్ కు ఆశ్రిత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాళోజి 111వ జయంతి



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ముస్తాబాద్**

ముస్తాబాద్ మండలం తుర్కపల్లి గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజి నారాయణరావు 111వ జయంతి సందర్బంగా ఆయన కు పూలమాల వేసి స్మరించుకున్నారు.. కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి కావేటి పర్శరాములు, అంబేద్కర్ సంఘం నాయకులు కాశోల్ల దుర్గాప్రసాద్, మైసయ్య, పర్శరాములు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

# మహిళా సంఘాలు ఆర్థికంగా వృద్ధి చెందాలి



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ తంగళ్ళపల్లి ప్రతినిధి**

ఇందిరా మహిళా శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల ఏర్పాటు చేసుకునే అవకాశం పొందిన మహిళలు పకడ్బందీగా వ్యాపారం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. ఇందిరా మహిళా శక్తి కింద తంగళ్ళపల్లి మండలం కేంద్రంలో తేజశ్రీ గ్రామ సమైక్య మహిళా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ఎరువులు %ుే% విత్తనాల దుకాణాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్,ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని తెలిపారు. త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యలో ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే పలు దుకాణాలు ప్రారంభించామని వివరించారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమమని వెల్లడించారు. మహిళా సంఘాల సభ్యులు ప్రణాళిక ప్రకారం నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు,



పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింగం, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్బంగా

### సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వ తారీకు వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవాపక్షం



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

కార్యక్రమంలో భాగంగా నేడు రాజన్న సిరిసిల్ల జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యశాల నిర్వహించడం ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ సిరికొండ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథి బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు శ్రీ రెడ్డ బోయిన గోపి మరియు వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్ మరియు అల్లాడి రమేష్ మరియు రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్ పాల్గొన్నారు ఈ సమావేశాన్ని ఉద్దేశించి బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీ రెడ్డబోయిన గోపి ఈ విధంగా మాట్లాడారు స్వచ్ఛ భారత్, రక్తదాన శిబిరం, పేదలకు, వికలాంగులకు సహకరించడం వంటి తదితర సేవా కార్యక్రమాలు చేపట్టి "సేవాపక్షం" విజయవంతం చేసేందుకు చేపట్టవలసిన కార్యాచరణను గురించి సమావేశంలో వివరించడం జరిగింది. ఈ సమావేశంలో ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దేవేందర్ యాదవ్ పార్ల మెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశం మరియు శీలం రాజు మరియు ఉపాధ్యక్షురాలు శ్రీమతి బర్కం లక్ష్మి సిరిసిల్ల అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి ఈ కార్యక్రమానికి కో కన్వీనర్ పల్లం అన్నపూర్ణ సక్రియ కార్యకర్త సంతోష్ బాబు మరియు కార్తీక్ రెడ్డి మరియు మానుక కుమార్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ రాష్ట్ర మరియు జిల్లా పదాధికారులు సీనియర్ నాయకులు వివిధ మోర్చాల నాయకులు వివిధ మండలాల అధ్యక్షులు మరియు కన్వీనర్ మరియు కో కన్వీనర్లు పాల్గొన్నారు

# ఆన్ లైన్ కోచింగ్ తరగతులను సద్వినియోగ పరుచుకోవాలి



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్**

ఆన్ లైన్ కోచింగ్ తరగతులను సద్వినియోగ పరుచుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ అన్నారు. బోయిన్ పల్లి మండల కేంద్రం లోని తెలంగాణ మోడల్ స్కూల్ లో ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ తరగతులను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పిల్లలకు పోటీ పరీక్షల రాసేందుకు ఆన్ లైన్ తరగతుల ద్వారా మంచి శిక్షణ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆన్ లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢిల్లీ లో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన సిరిసిల్ల జిల్లాలోని పిల్లలకు కూడా అందిస్తున్నామని అన్నారు.ప్రతి రోజు కనీసం 2 గంటల పాటు ఆన్ లైన్ కోచ్చింగ్ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.విద్యార్థి జీవితంలో 10,11,12వ తరగతులు 3 సంవత్సరాలు చాలా కీలక సమయమని, దీనిని సద్వినియోగం చేసుకుంటే జీవితం బాగుంటుందని అన్నారు.ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ ఇంటర్ లో ప్రారంభం అవుతాయని అన్నారు.

విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన ఆన్ లైన్ తరగతులు శిక్షణ సౌకర్యం విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఆన్ లైన్ తరగతులలో మన సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉందని, ప్రతి విద్యార్థి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మాడల్ స్కూల్ లో విద్యార్థులకు ఫ్యాన్లు లేవని తెలుపగ వెంటనే 50 ఫ్యాన్లు మంజూరు చేయవలసిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు.సిరిసిల్ల జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చోరువ చూపారని అన్నారు. మోడల్ స్కూల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లు కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తాసిల్దార్ ఎంపీడీవో కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, స్థానిక నాయకులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డి ఆర్ డి ఏ,పంచాయతీ రాజ్ , మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం , అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, ప్లాస్టిక్ వెయిట్ మేనేజ్మెంట్ యూనిట్, సెగ్రికేషన్ షెడ్, అంగన్వాడి కేంద్రాలలో మౌలిక వసతుల కల్పన వంటి అభివృద్ధి పనుల పురోగతి పై సమీక్షించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ

సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ రాజ్ , మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా మంజూరు చేసిన అభివృద్ధి పనులు గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులు ఆదేశించారు.మన జిల్లాలో 26 గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణం ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని అన్నారు.

ముందుగా రెండు వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న ఆవాసాలకు మొదటి ప్రాధాన్యతగా, 1500 జనాభా ఉన్న ఆవాసాలకు తదుపరి ప్రాధాన్యతగా జిపి బోనా నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు.

సిరిసిల్ల వేములవాడలో కోటి 28 లక్షల రూపాయలతో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ క్రింద జిల్లాకు మంజూరైన 7 కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ గ్రౌండ్ వచ్చేసి పూర్తిచేయాలని అన్నారు. జిల్లాలోని నూతనంగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలలో సెగ్రిగేషన్ షెడ్డు ఉపాధి హామీ నిధులతో నిర్మించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతి నెల త్రాగునీటి తరఫున పై సమీక్ష నిర్వహించుకుని స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్, జల్ జీవన్ మిషన్ పథకాలను వినియోగించుకుంటూ అవసరమైన కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేస్తూ ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని అన్నారు.

జిల్లాలో ఉన్న అంగన్వాడి కేంద్రాలలో 100% టాయిలెట్ , త్రాగునీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్ ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిటీ ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో డిఆర్డిఏ శేషాద్రి, డిడబ్ల్యు ఓ లక్ష్మీరాజ్యం, ఈ ఈ పి ఆర్ సుదర్శన్ రెడ్డి డిపిఓ షరీఫుద్దీన్ ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

## ముగ్గురు విద్యార్థులకు గాయాలు

### భోజన విరామ

### సమయంలో కూలడంతో తప్పిన పెనుప్రమాదం

### సంగారెడ్డి జిల్లా లింగంపల్లిలో ఘటన

### ఘటనాస్థలిని

### పరిశీలించిన మంత్రి దామోదర రాజనర్సింహా



మునిపల్లి: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలోని గురుకుల పాఠశాలలోని హాస్టల్ భవనం మంగళవారం కూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. పాఠశాలకు చెందిన విద్యార్థులంతా ఆ భవనంలోనే వసతి పొందుతున్నారు. కానీ, అదృష్టం కొద్దీ భోజన విరామ సమయంలో భవనం కూలడం వల్ల పెను ప్రమాదమే తప్పింది. లింగంపల్లి గురుకుల పాఠశాలలో మొత్తం 601 మంది విద్యార్థులు ఉన్నారు. ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న పాఠశాలలోని ఓ భవనంలో విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. ఎప్పట్లాగే విద్యార్థులంతా మంగళవారం ఉదయం హాస్టల్ నుంచి పక్కనే ఉన్న పాఠశాలకు వెళ్లిపోయారు. అయితే, భోజన విరామ సమయంలో హాస్టల్ ముందుకు ముగ్గురు విద్యార్థులు వస్తున్న క్రమంలో.. ఆ భవనం వెనుక భాగం గోడ ఒక్కసారిగా కూలిపోయింది. ఆ పెచ్చులు, ఇటుకలు తగిలి తిరూర్ జ్ఞానేశ్వర్(పదో తరగతి), శివ( ఇంటర్ ఫస్టియిర్), అరవింద్(ఆరో తరగతి) అనే విద్యార్థులు గాయపడ్డారు. బాధిత విద్యార్థులను పాఠశాల సిబ్బంది హుటాహుటిన జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇక, విషయం తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న టీఎసఎఫడీ, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు శిథిలాల కింద ఉన్న విద్యార్థుల సామగ్రి, ఇతర వస్తువులను తరలించే పని మొదలుపెట్టాయి. వారు విద్యార్థుల ట్రంక్ పెట్టెలను బయటకు తీస్తున్న క్రమంలో భవనంలో మిగిలిన భాగం కూడా నేలమట్టమైంది. శిథిలాల కింద 80 మంది ఏడో తరగతి విద్యార్థులకు చెందిన వస్తువులు ఉన్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. ఇక, పాఠశాల భవనం కూలిన విషయం తెలుసుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పాఠశాల, హాస్టల్లో నెలకొన్న సమస్యలపై నివేదిక ఇవ్వాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురభి చైతన్యను ఆదేశించారు. అలాగే, పాఠశాలల్లో పురాతన భవనాలను గుర్తించి వెంటనే కూల్చివేయాలని అధికారులకు సూచించారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, డీఈఓ వెంకటేశ్వర్లు పాఠశాల భవనాన్ని పరిశీలించారు. భవనం శిథిలావస్థలో ఉన్న విషయాన్ని అధికారుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదంటూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య లింగంపల్లి గురుకుల పాఠశాల నిర్వాహకులపై ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనంలో విద్యార్థులు ఉన్న సమయంలో ప్రమాదం జరిగి ఉంటే పరిస్థితి ఏంటి ? అని ప్రశ్నించారు. విద్యార్థులు ఉన్నప్పుడు ఘటన జరిగి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేందన్నారు. విద్యార్థులకు తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేయించిన కలెక్టర్... పాఠశాల నూతన భవన నిర్మాణం కోసం రూ.7 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. భవనం కూలిన సంగతి తెలిసి మిగిలిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Pri- ted at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com